
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 24 । నవంబర్ । 2022




వంజంగి అందాలు అదరహో

సాక్షి, పాడేరు : పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌లో బుధవారం ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. వేకువజామున సూర్యోదయంతో పాటు, కొండలను తాకుతూ దర్శనమిచ్చిన పొగమంచు అందాలు మంత్రముగ్ధుల్ని చేశాయి.



భవిష్యత్తులో టీడీపీ కనుమరుగు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్‌సీపీలోకి భారీగా టీడీపీ నేతల చేరిక

8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా బొత్స

జిల్లా అధ్యక్షురాలిగా పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


బొత్స సత్యనారాయణ


భాగ్యలక్ష్మి

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా రీజనల్ కోఆర్డినేటర్‌గా విద్యాశాఖ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మిని నియమించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జేసీ కొత్తపల్లి జలపాతం సందర్శన


కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ సందర్శించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. జలపాతాలకు వచ్చే పర్యాటకులు, ఇక్కడ ఉన్న సౌకర్యాలు, నిర్వహణ, ఇబ్బందులు, సమస్యలు తదితర వివరాలను ఎకో టూరిజం సూపర్‌వైజర్ వంతాల అభి, నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మెట్ల సమస్యను వారు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు.

రైతుల ఖాతాల్లో జీరో వడ్డీ నగదు జమ


జీరో వడ్డీ రాయితీ పొందిన రైతుల జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు

రాజవొమ్మంగి: మండలంలో 2020–21 ఖరీఫ్ సీజన్‌లో బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందిన 191 మంది రైతులకు రూ.3.19 లక్షల జీరో వడ్డీ సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని మండల వ్యవసాయాధికారి రమేష్ నాయుడు తెలిపారు. వీటి వివరాలను జాబితా రూపంలో రైతులకు సౌకర్యార్థం సచివాలయాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ జాబితాలను పరిశీలించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రంగురాళ్ల తవ్వకందారుల అరెస్టు

రక్షిత అటవీ ప్రాంతంలో పట్టుకున్న పోలీసులు

అడ్డతీగల: తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలోని పిచ్చిమెటల్ క్వారీ వద్ద రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్‌చేసినట్లు అడ్డతీగల ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం అన్వేషిస్తూ తవ్వకాలు తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. మండలంలోని చిన్నమునకనగడ్డకి చెందిన ఐదుగురు పట్టుబడినట్టు ఆయన వివరించారు. వీరిని అరెస్ట్ చేసి రంపచోడవరం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చినట్టు చెప్పారు. చట్టవిరుద్ధంగా రక్షిత అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల కోసం తవ్వకాలు సాగించినా, విక్రయాలు జరిపినా లేదా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వలిసెలు అందం.. ఆదాయం

- సాగుపై గిరిజనుల ఆసక్తి
- ఆర్థికాభివృద్ధికి దోహదం

-8లో



• కలిసొచ్చిన కార్తీకం

నాలుగు వారాలు.. రూ.71,38,640

గుహలు.. ఇవి వినగానే అందరికీ ముందుగా గుర్తుకొచ్చేది బొర్రా. ఇవి చూసేందుకు అందంగా.. పర్యాటకులను ఆకర్షించేలా ఉంటాయి. అనంతగిరి ప్రాంతంలో అతి పురాతనమైనవిగా ఖ్యాతికెక్కిన వీటిని తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. ఇలా వీరి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఏడాది భారీ స్థాయిలో తరలిరావడంతో పర్యాటకశాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది.


బొర్రాగుహలను తిలకిస్తున్న పర్యాటకులు

నెల రోజుల్లో 91,003 మంది బొర్రా గుహల సందర్శన

ఈనెల 20న అత్యధికంగా 10,913 మంది రాక

ఆ ఒక్క రోజు రికార్డు స్థాయిలో రూ.8.5 లక్షల ఆదాయం

అనంతగిరి: మన్యంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన బొర్రాగుహలకు విశేష ఆదరణ ఉంది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు ఏమాత్రం అవకాశం ఉన్నా వీటిని సందర్శించేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. వీటి అందాలకు ఫిదా అవుతుంటారు. 150 మిలియన్ సంవత్సరాల క్రితం భౌగోళిక రసాయన చర్యల ఫలితంగా ఇవి ఏర్పడ్డాయి. సున్నపురాయి కరిగి, గుహలు లోపల డైనోసార్, మానవ మెదడు, శివలింగం, శివపార్వతి, రుషి, సాయిబాబా, తేనెపట్టు ఇలా వివిధ ఆకృతులు ఏర్పడి పర్యాటకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి.

రెండో గుహ ప్రారంభానికి సన్నాహాలు

బొర్రాలోని రెండో గుహ ప్రారంభించేందుకు పర్యాటకశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతోపాటు గోస్తనీ నదిపై రోప్‌వేను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన చర్యలు చేపట్టారు. బొర్రా గుహలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మరింత అనుభూతిని అందించేలా పర్యాటకశాఖ మరో అడుగుముందుకు వేసింది.

నాలుగు వారాల్లో 91,003 వేల మంది..

కార్తీకమాసంలో బొర్రాగుహలు కళకళలాడాయి. మొదటివారం నుంచి చివరివారం వరకు గుహల అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. నాలుగు వారాల్లో సుమారు 91,003 మంది గుహలను తిలకించగా, సుమారు రూ.71,38,640 మేర ఆదాయం వచ్చింది. ఈనెల మూడో ఆదివారం 10,510 మంది బొర్రాగుహలను తిలకించారు. నాలుగో ఆదివారం 10,913 మంది తిలకించడంతో ఈ ఏడాదిలోని కార్తీకమాసం నాలుగో ఆదివారం రికార్డుగా నిలిచింది.

రోజువారీ ఇలా..

గతనెల 28న 2146 మంది సందర్శించగా రూ.1.67 లక్షలు, 29న 3056 మందికి రూ.2.4లక్షలు, 30న 3932 మందికి రూ.3 లక్షలు, 31న 2200 మందికి రూ.1.74 లక్షల ఆదాయం వచ్చింది. ప్రస్తుత నెలలో ఒకటిన 1540 మంది సందర్శించగా రూ.1.22 లక్షలు, రెండున 1388 మందికి రూ.1.10 లక్షలు, మూడున 1167 మందికి రూ.92 వేలు, 4న 1446 మంది రూ.1.15 లక్షలు, ఐదున 2617 మందికి రూ.2లక్షలు, ఆరున 5547 మందికి రూ.4.19లక్షలు, 8న 1702 మందికి రూ.1.35 లక్షలు, 9న 2236 మందికి రూ.1.76 లక్షలు, 10న 2485 మందికి రూ.1.96 లక్షలు, 11న 2800 మందికి రూ.2.20లక్షలు, 12న 6953 మందికి రూ.5.45 లక్షలు, 13న 10,510 మందికి రూ.8.16లక్షలు, 14న 4610 మందికి రూ.3.61 లక్షలు, 15న 3415 మందికి రూ.2.68 లక్షలు, 16న 3130 మందికి రూ.2.47 లక్షలు, 18న 2300 మందికి రూ.1.82 లక్షలు, 19న 5720 మందికి రూ.4.52 లక్షలు, 20న 10,913 మందికి రూ.8.5లక్షలు, 21న 4454 మందికి రూ.3.5 లక్షల ఆదాయం సమకూరింది.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



"వివిధ ప్రాంతాల నుంచి గుహలను అందాలను తిలకించేందుకు ఈ ఏడాది కార్తీకమాసంలో భారీగా తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం."
–గౌరీశంకర్, మేనేజర్, బొర్రా గుహలు

సీఎం జగన్‌కు స్వాగతం.. వీడ్కోలు


విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): శ్రీకాకుళం జిల్లాలో పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ విమానాశ్రయంలో ట్రాన్సిట్ హాల్టు చేశారు. ఉదయం 9.38 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. ఇక్కడి నుంచి 9.55 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు. శ్రీకాకుళం నుంచి 2.40గంటలకు విశాఖ చేరుకుని, ప్రత్యేక విమానంలో 2.50కు గన్నవరం బయలుదేరారు. విశాఖ విమానాశ్రయంలో మంత్రి బొత్స సత్యనారాయణ, మేయర్ హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.వి సత్యవతి, జి.మాధవి, ఎమ్మె ల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తదితరులు స్వాగతం, వీడ్కోలు పలికారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు
- మాతాశిశుమరణాల నివారణే లక్ష్యం
- ప్రజలకు అందుబాటులో ఉండాలి
- వైద్యసిబ్బంది, అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- గంగవరం మండలంలో సుడిగాలి పర్యటన


వేములోవ ఆశ్రమ పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


పిడతమామిడి పీహెచ్‌సీలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగవరం: గిరి ప్రజల విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. పిడతమామిడి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన సుమారు గంటపాటు పీహెచ్‌సీ పరిధిలో కార్యక్రమాలపై సమీక్షించారు. వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సూచనలు చేశారు. రక్త నమూనాల సేకరణ, పరీక్షలపై ల్యాబ్ టెక్నీషియన్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమపాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. మాతాశిశు మరణాల నివారణ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఇదే గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గుడ్లు, వైఎస్సార్ పోషణ కిట్లను కలెక్టర్ పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల నుంచి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

సద్వినియోగం చేసుకోండి

బాలికా విద్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినులతో ఆయన ముచ్చటించారు. వివిధ తరగతి గదులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. ఇంగ్లీష్ సబ్జెక్టుకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలు, సిబ్బంది, విద్యార్థుల హాజరును పరిశీలించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో బి. శ్రీనివాసులు, పిహెచ్‌సీ వైద్యధికారి సాయి రతన్, సచివాలయ కార్యదర్శి వెంకట సురేష్ ,వేములోవ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం గీతాంజలి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లు 2,43,903

- 297 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళిక
- ఎలక్టోరల్ డ్రాఫ్ట్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- వచ్చేనెల 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదాని రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఉత్తరాంధ్ర పరిధిలో మొత్తం 2,43,903 మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు ముసాయిదాలో ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో మొత్తం 297 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు డ్రాఫ్ట్‌లో పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 80,105 మంది ఓటర్లుండగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10,200 ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల ముసాయిదాపై ఏమైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 9లోగా ఫారం–18 ద్వారా తెలపాలని కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఈఆర్‌వోలు, ఏఈఆర్వోలు, డిసిగ్నేటెడ్ అధికారుల ద్వారా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	57	32,351	13,764	04	46,119
విజయనగరం	64	35,787	18,670	09	54,466
పార్వతీపురం మన్యం	24	11,544	5,507	01	17,052
అల్లూరి	14	7,085	3,112	03	10,200
విశాఖపట్నం	94	44,805	35,287	13	80,105
అనకాపల్లి	44	24,231	11,722	08	35,961
మొత్తం	297	1,55,803	88,062	38	2,43,903

ఘనంగా సహస్ర దీపార్చన


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ పూజారి రామం,ఆలయ ధర్మకర్తమండలి అధ్యక్షుడు కొట్టగుళ్లి సింహచలంనాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ముందుగా పలు రకాల పూలతో శివలింగం, ఓంకారం, త్రిశూలం నమూనాలను తీర్చిదిద్దారు. అనంతరం మహిళలంతా సహస్ర దీపార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బలరామ్‌మజ్జి, పిన్నయ్యదొర, పోతురాజు, బాలుమాస్టర్, కొట్టగుళ్లి రామారావు, సిద్దనాతి కొండలరావు,శివరాత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



సాక్షి,పాడేరు: అరకులోయ మండలం కినంగూడకు చెందిన క్రీడాకారుడు దురియా విశాల్ అభిషేక్‌ను ఐటీడీఏ పీవో గో ఆర్.గోపాలకృష్ణ బుధవారం శాలువా కప్పి సత్కరించారు. ఇటీవల విశాఖలో జరిగిన నేవీ మారథాన్ 2022 పోటీల్లో అభిషేక్ ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా అతనిని పీవో అభినందించారు. అరకులోయకు చెందిన పట్టాసి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పట్టాసి భాస్కరరావు, పట్టాసి జగన్నాథరావు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య కార్యక్రమాలు

- పాఠశాలలపై నిత్యం పర్యవేక్షణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- అధికారులతో వీడియో కాన్ఫరెన్సు


రంపచోడవరం ఐటీడీఏలో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ఆదేశించారు. పథకాల అమలుతీరుపై స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి బుధవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు అమలకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలుపై అధికారులతో మాట్లాడారు. మహిళా పోలీసులు, ఏఎన్‌ఎం, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పాఠశాలలను పరిశీలించి గ్రామస్తుల అభిప్రాయాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. వై రామవరం– కొయ్యూరు మధ్యలో పాఠశాలలను ఎంపీడీవోలు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు మంజూరైన వారికి జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. జగనన్న తోడు పథకం కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలని ఎంపీడీవోలకు సూచించారు. భూముల రీసర్వేపై సమీక్షించారు. సెల్ టవర్ల ఏర్పాటుపై అధికారులతో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఫర్మన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ అశితోష్ శ్రీవాస్తవ, డీఆర్వో బి దయానిధి, జిల్లా సర్వే అధికారి మోహనరావు, ఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉదయం మంచు.. సాయంత్రం వాన..

- ఏజెన్సీలో భిన్న వాతావరణం
- మళ్లీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలితీవ్రత


వరి పొలాల్లో ఆరబెట్టిన పనలు


పాడేరు పాత బస్టాండ్‌లో బుధవారం ఉదయం 8 గంటలకు కురుస్తున్న పొగమంచు


పాడేరు పాత బస్టాండ్‌లో బుధవారం రాత్రి కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో బుధవారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. రాత్రి వరకు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 14 డిగ్రీలు, అరకులోయలో 16.5 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మళ్లీ చలితీవ్రత పెరిగింది. ఈ అకాల వర్షాలతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమవ్వడంతో పనలను పొలాల్లోనే ఉంచేశారు. వీటిపై ప్లాస్టిక్ కవర్లను కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నంలో గిరి రైతులు ఉన్నారు.

వరి రైతుల్లో కలవరం

హుకుంపేట: వాతావరణంలో మార్పులు, మబ్బులు, అక్కడక్కడ పడుతున్న చినుకులు వరి రైతుల్లో గుబులు రేపుతున్నాయి. ఇప్పటికే మండలంలో చాలావరకు వరి కోతలు పూర్తయ్యాయి. వరి పనలను పొలాల్లోనే గిరి రైతులు ఆరబెట్టారు. ఈ పరిస్థితుల్లో అక్కడక్కడ కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

మనోహరం



అందాల అరకులోయకు ఈ ఏడాది పొద్దు తిరుగుడు పంట అదనపు వన్నెలద్దుతోంది. వలిసె పూల అందాలకు తోడై పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తోంది. పాడేరు- అరకు మార్గంలో డుంబ్రిగుడ, హుకుంపేట, అరకులోయ రోడ్డును ఆనుకొని పొద్దుతిరుగుడుపూలు కనువిందు చేస్తున్నాయి. వీటితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. - సాక్షి, పాడేరు

ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు


కె.సావిత్రి , ఏడీఏ

అడ్డతీగల: అడ్డతీగల సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 26 ఆర్‌బీకేలు(రైతు భరోసా కేంద్రాలు) ఉండగా, 13 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్టు ఏడీఏ కంకిపాటి సావిత్రి చెప్పారు. అడ్డతీగల మండలంలో వెంకటనగరం, తిమ్మాపురం, తుంగమడుగులలో, గంగవరం మండలంలో కొత్తాడ, జడేరు, భయ్యనపల్లిలో, వై.రామవరం మండలంలోని చవిటిదిబ్బలు, వై.రామవరం, గుర్తేడు, చింతలపూడిలో, రాజవొమ్మంగి మండలంలోని రాజవొమ్మంగి, జెడ్డంగి, లాగరాయి ప్రాంతాల్లోని ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఏ-గ్రేడు రకం ధాన్యం ప్రభుత్వ ధర క్వింటా రూ.2,060 కాగా, సాధారణ రకం ఎంటియు-1064,1061,1121 రకాలు క్వింటా రూ.2,040 ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. ఈ-క్రాప్ రశీదుల పంపిణీ పూర్తయిన వెంటనే గ్రామాల్లో ధాన్యం కోతలు అనంతరం కొనుగోలు ప్రారంభిస్తామన్నారు.ఈ మేరకు ఆర్‌బీకే పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ వలంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.


దేవీపట్నంలోని మాట్లాడుతున్న తహసీల్దార్ వీరభద్రరావు

ధాన్యం కొనుగోలుపై అవగాహన

దేవీపట్నం: ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని తహసీల్దార్ వీరభద్రరావు సూచించారు. వీఆర్‌ఓలు, వీఏఏ, వీహెచ్‌ఏలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలుపై పలు సూచనలిచ్చారు. ఏవో ఎస్. ఝాన్సీ మాట్లాడుతూ రైతులు గోనె సంచులతో ధాన్యం విక్రయిస్తే సంచికి రూ.3.39, రవాణా ఖర్చులు టన్నుకు రూ.324 చెల్లిస్తామన్నారు. 8 కిలోమీటర్లు దాటితే టన్నుకు రూ.10 అదనంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఎంపీడీవో రత్నకుమారి మాట్లాడుతూ ప్రతీ పీపీసీ కేంద్రానికి ఇద్దరు వలంటీర్లు నియమించినట్లు తెలిపారు.

వలిసెలు అందం..ఆదాయం

- వలిసె సాగుపై గిరిజనుల ఆసక్తి
- ఆర్థికాభివృద్ధికి దోహదం


వలిసె సాగు


వలిసె తోటలో పర్యాటకుల సందడి

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో ఏటా నవంబర్ నుంచి జనవర నెలల్లో ఎటు చూసినా పసుపు చీరకట్టిన పడుచులా వలిసె పూలతోటలు చూడచక్కగా కనువిందు చేస్తాయి. రహదారులకు ఇరువైపులా ఉన్న వలిసె పూల తోటలో మన్య ప్రాంత ప్రకృతి అందాలకు మరింత శోభనిస్తూ మనసు దోచుకుంటాయి. దీంతో మన్యానికి వచ్చిన పర్యాటకులు వలిసె తోటల అందాలకు ఫిదా అయి..ఫొటోలు తీసుకుంటూ మురిసిపోతున్నారు. వలిసెల పంట సాగుతో ప్రకృతి అందంతో పాటు ఆదాయ వనరుగా గిరిజనులను ఆదుకుంటుంది.

మార్కెట్‌లో గిరాకీ

వలిసె అందంతో పాటు ఆరోగ్యానిచ్చే పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వలిసె పువ్వుల్లో తేనె ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి వంద చొప్పున తేనె పెట్టెల చొప్పున ఉంచి తేనెటీగల సాయంతో గిరిజనులు తేనెను సేకరిస్తారు. ఒక్కో పెట్టె నుంచి 35 నుంచి 40 కిలోలచొప్పున తేనె దిగుబడి వస్తుంది. వలిసె గింజల నుంచి వంటనూనె తీస్తారు. ఈ నూనెను పలు కాస్మోటిక్స్, పెయింటింగ్ తయారీలో వినియోగిస్తారు. ప్రోటీనులు ఎక్కువగా ఉండే వలిసె గింజలను కోళ్ల, పక్షుల దాణా తయారీలో మిశ్రంగా వాడుతారు. చల్లని వాతావరణం వలిసె సాగుకు అనుకూలం.. పరిమాణం, రంగు తేడాను బట్టి 30 రకాలు వరకు ఉన్నాయి. అయితే గత నాలుగేళ్లుగా ఏజెన్సీలో వలిసె దిగుబడి తగ్గిన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ పంటకు ఆకాశ పందిరి, బంగారు తీగ కలుపుతో దిగుబడి తగ్గింది. ఫలితంగా పంట విస్తీర్ణం తగ్గిపోయింది. కలుపు నివారణకు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ప్రత్యేక చర్యలు తీసకుంటున్నారు. సాగు, రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వినూత్న ఆలోచనతో ఆదాయం

ప్రస్తుతం వలిసె పంటకు విపరీతంగా తెగుళ్ల ఆశించడంతో పాటు గణనీయంగా దిగుబడి తగ్గడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్న కొద్ది పాటి వలిసె తోటలను జాగ్రత్తగా కాపాడుకుంటూ ఓ వినూత్న ఆలోచనతో పర్యాటక ప్రదేశంగా మార్చిన ఓ గిరిజన రైతు కొంత ఆదాయం పొందుతున్నారు. అరకు సంతబయలు ప్రాంతానికి చెందిన హరిబందు అనే గిరిజన రైతుకు ఒక వినూత్న ఆలోచన వచ్చింది.. వలిసెల పంట వేసే ప్రదేశంలో పర్యాటకులను ఆకట్టుకునేందకు రంగురంగుల గొడుగులు, కుర్చీలను ఉంచి పర్యాటకులు సేదతీరేలా ఏర్పాట్లు చేశారు. ఆ ప్రయత్నం ఇప్పుడు కొంత మంది వలిసెల రైతులకు వరంలా మారింది. పాడేరు నుంచి హుకుంపేట, ముంచంగిపుట్టు నుంచి ఏవోబీ సరిహద్దు ప్రాంత వరకు చాలా మంది రైతులు వలిసెల తోటల్లో గొడుగులు, కుర్చీలు వేసి పర్యాటకులు ఫోటోలు, సెల్ఫీలు దిగి సేద తీరే విధంగా ఏర్పాట్లు చేశారు. ఒక్కొ మనిషికి రూ.10 నుంఇచ రూ.20 చోప్పున వసూలు చేస్తున్నారు. చుట్టూ కొండలు, పచ్చని ప్రకృతి అందాల నడుమ పసుపు పూల సోయగాలను ఆస్వాదిస్తూ కొద్దిసేపు పర్యాటకులు ఆనందంగా గడుపుతున్నారు.

ప్రత్యామ్నాయ ఆదాయం

వలిసెల పంటతో కొంతమేరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం దిగుబడి తగ్గి సరైన ధర లేదు. దీంతో వలిసె తోటల్లో గొడుగులు, కుర్చీలు ఏర్పాటుచేసి, రూ.10 నుంచి రూ.20వరకు వసూలు చేసి కొంత ఆదాయం పొందుతున్నాం . ఒడిశానుంచి వచ్చి సినిమా షూటింగ్‌లు సైతం తీశారు. రూ.2వేలు ఇచ్చారు. వలిసె తోటల ద్వారా కొంత ప్రత్యామ్నాయ ఆదాయం రావడం సంతోషంగా ఉంది.

–జి.సోమ్రు, వలిసెల రైతు, మొక్కపుట్టు గ్రామం , ముంచంగిపుట్టు మండలం

ఆనందంగా ఉంది

వలిసెల అందాలు చూసేందుకు ఏటా విజయవాడ నుంచి అరకు, పాడేరు ప్రాంతాలకు వస్తాను. ఇక్కడి వలిసెపూట తోటలు గిరిజన ప్రాంతానికే ఎంతో వన్నె తెస్తున్నాయి. వలిసెల తోటలో గొడుగులు, కుర్చీలు ఏర్పాటుతో ఆహ్వానం పలకడం బాగుంది. తోటల్లో ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు పేద రైతులకు రూ.10 నుంచి రూ.20 ఇవ్వడంతో వారికి ఆర్థికంగా చేయూతనివ్వడం ఆనందంగా ఉంది.

–పొట్నూరు ఆకాష్, పర్యాటకుడు, విజయవాడ

భవిష్యత్తులో టీడీపీ కనుమరుగు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో టీడీపీ భవిష్యత్తులో కనుమరుగు ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంతో పాటు పనస గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ తమర్బ నారాయణ, ఉప సర్పంచ్ కవెర్ల హరిప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ మేడ కర్రిబుడ్డి, వార్డు మెంబర్లు చిట్టపులి నాగేష్ పడాల్, దూరియ నిర్మల, టీడీపీ ముఖ్యనేతలు మాధవరావు, అప్పన్న, ,సింహాచలం, గున్నయ్య, కర్రిబాబు, సుందరరావు, అప్పారావు, హరి, సోమేష్, హరికృష్ణ తదితర 23 కుటుంబాలకు చెందిన 98 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీటీసీ తమర్బ గణపతి సమక్షంలో వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆహ్వానించారు. సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్ మండి బాబూరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, పార్టీ నేతలు జేవీవీఎస్ మూర్తి, శంకర్, దాసు, పులిరాజు, వెంకట్, మత్స్యలింగం, నమ్మయ్య, పిత్ బాష్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

రాజవొమ్మంగి: జడ్డంగి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి (21) అనే యువతి అదృశ్యం అయినట్టు ఫిర్యాదు అందిందని జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. వివరాలివి. మండలంలోని జడ్డంగి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి అమీనాబాద్‌కు చెందిన దావీదుతో మూడేళ్ల కిందట వివాహం అయ్యింది. ఈనెల 21వ తేదీ నుంచి వెంకటలక్ష్మి కనిపించడం లేదని అత్తవారి కుటుంబీకులు వెంకటలక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

ప్రజల చెంతకు మెరుగైన వైద్యం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- పెదగూడలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం ప్రారంభం


ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో ఎస్ఆర్‌హెచ్‌ఎం నిధులు రూ.20 లక్షల తో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్ర భవనాలను బుధవారం వారు ప్రారంభించారు. మందులు,ఆరోగ్య ఉప కేంద్రంపై ఆధారపడి ఉన్న గ్రామాల వివరాలను వైద్యాధికారి రమేష్ నుంచి తెలుసుకున్నారు.ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా నిత్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో మెరుగుపడ్డాయన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ మన్యంలో వైద్యసేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాడేరులో మెడికల్ కళాశాల ఏర్పాటు వల్ల గిరిజనులు వైద్య రంగంలో కూడా ఎదగాలన్నది ముఖ్యమంత్రి జగనన్న ఉద్దేశమన్నారు. అంతకుముందు వనభసింగి పంచాయతీ కేంద్రంలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర భూమి పూజ చేశారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మల్లికార్జున్, పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, సర్పంచ్‌లు బాబూరావు, రమేష్, ఎంపీటీసీలు గణపతి, కమల తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ మీట్‌లో సత్తాచాటిన ఆశ్రమ విద్యార్థిని


విద్యార్థిని అనురాధను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: విశాఖ గీతం యూనివర్సిటీలో ఏడు ఐటీడీఏలకు చెందిన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర ట్రైబల్ మీట్‌లో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాల–1 విద్యార్థిని అనురాధ సత్తా చాటింది. జావెలిన్ త్రోలో ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఆమెతో పాటు పీడీ కె.నర్సింహమూర్తిని హెచ్‌ఎం కె.లక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న కో-ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్

గంగవరం: గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన మోఖాసా భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు ఈ పంట నమోదు చేయకపోవడం వలన నష్ట పోతున్నారని, న్యాయం చేయాలని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు కెఎస్.ప్రభాకర్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. పిడతమామిడి పర్యటనలో ఉన్న కలెక్టర్‌ను ఆయన కలసి నెల్లిపూడి మోఖాసా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ-పంట నమోదు జరగని కారణంగా రైతులు పంటల బీమా, రైతు భరోసా పథకాలను కోల్పోతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీమన్నారాయనను ఆదేశించారు.

ఆశలు గల్లంతు

శారదానదిలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


విద్యార్థి లోవబాబు మృతదేహం

చోడవరం రూరల్: అందరూ భయపడినట్టే ..ఆ విద్యార్థి విగత జీవిగానే లభ్యమయ్యాడు. సంగమేశ్వరుని చెంత శారదానదిలో ఈతకు దిగి గల్లంతైన 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి కాతా లోవబాబు నదిలో ప్రమాదవశాత్తూ మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద వార్త తెలుసుకున్న సోమవారం మధ్యాహ్నం నుంచి కొడుకు కొన ఊపిరితోనైనా కనిపించక పోతాడా...అని కళ్లలో ఒత్తులు వేసుకుని నది ఒడ్డునే ఎదురు చూసిన తండ్రి త్రినాథరావు ఆశలు గల్లంతయ్యాయి. ఉదయం ఆరు గంటల సమయంలో నదిలో గాలింపు కోసం సిద్ధం అవుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి నీటిపై తేలియాడుతూ లోవబాబు మృతదేహం లభ్యమయ్యింది. బోటుపై ఒడ్డుకు తీసుకు వచ్చిన కుమారుడి మృతదేహాన్ని చూసిన తండ్రి త్రినాథరావు పంటిబిగువున దాచుకున్న దుఃఖం కట్టలు తెంచుకుని పెల్లుబుకడంతో ఒక్కసారిగా బావురుమంటూ విలపించడం అక్కడున్న వారినందరినీ కంట తడిపెట్టించింది. అతడిని సముదాయించడం ఆ ఊరి నుంచి తరలివచ్చిన బంధుగణం తరం కాలేదు. అంది వస్తాడనుకున్న కొడుకుపై పెట్టుకున్న ఆశలకు నీళ్ళు వదులు కోవలసిందేనా అంటూ వారితో రోధిస్తూ గుండెలు బాదుకున్నాడు. విద్యార్థి మృతదేహం లభ్యమయ్యిందన్న సమాచారం అందుకున్న చోడవరం సీఐ శ్రీనివాసరావు ముద్దుర్తి చేరుకుని సర్పంచ్ కె.వెంకట్ సమక్షంలో శవపంచనామా జరిపించారు. పోస్టుమార్టం నిమిత్తం లోవబాబు మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీయార్ ఆస్పత్రికి తరలించారు.

భట్లపూడి గ్రామంలో విషాదఛాయలు

అనకాపల్లిటౌన్: లోవబాబు మృతితో భట్లపూడి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాతా త్రినాథరావు రెండో కుమారుడు లోవబాబు స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చోడవరం మండలం ముద్దుర్తి గ్రామంలో సంగమేశ్వరాలయం వద్ద అన్నసమారాధన సేవకు తోటి విద్యార్థులతో పాటు వెళ్లాడు. ఈత సరదాతో శారదానదిలో దిగి గల్లంతయ్యాడు. నది వద్దే రెండు రోజులపాటు తండ్రి త్రినాథరావు తన కుమారుడు ప్రాణాలతో బయటపడతాడనే ఆశతో ఎదురు చూశాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపులో బుధవారం ఉదయం లోవబాబు విగతజీవిగా బయట పడడంతో ఆ తండ్రి భోరున విలపించాడు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. త్రినాథరావు కుటుంబ సభ్యులను బుధవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు.


పరామర్శిస్తున్న ఎంపీపీ సూరిబాబు

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వర్మ

కొయ్యూరు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నామని, వాటిని విద్యాశాఖా మంత్రికి నివేదిస్తామన్నారు. ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో బోడం నాయుడు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు బి.జగన్మోహనరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, మండల ప్రతినిధులు అచ్చిబాబు, అర్జున్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖండన/ప్రత్యుత్తర నోటీస్

మా క్లయింటు గూనూరు లేటు చంద్రరావు గారి కుమారుడు శ్రీ జి.వి.వి. సత్యనారాయణమూర్తి, అధ్యక్షులు, సింహాద్రి ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు సదరు సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాల, నారపాడు గ్రామం, సబ్బవరం మండలం, అనకాపల్లి జిల్లా వారి అధీకృత ప్రతినిధి వారు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మంది ప్రజానీకమునకు తగు మాత్రపు సమాచారము ఇచ్చు నిమిత్తమున్నూ మరియు తేది 22-11-2022 నాడు శ్రీ ఎన్.నారాయణ, న్యాయవాది వారి ద్వారా శ్రీ సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శిగా చెప్పుకుంటున్న శ్రీ పి.టి.డి. ప్రసాద్ గారు సాక్షి దినపత్రిక, విశాఖపట్నం మరియు అనకాపల్లి ఎడిషన్ల నందు ప్రచురించబడిన బహిరంగ ప్రకటనకు ఇచ్చుచున్న ఖండన/ప్రత్యుత్తర నోటీస్.

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన బహిరంగ ప్రకటనలోని అంశములు అన్నియూ సత్య దూరమైనవి అనియు, వాస్తవ పరిస్థితులకు అతీతమైనవై యున్నవి అనియూ తెలియపరచడమైనది. తేది 17-09-2022 నాడు జరిగిన సొసైటీ అత్యవసర ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ మూలకముగా 1. శ్రీ జి.వి.వి. సత్యనారాయణ మూర్తి, ప్రెసిడెంట్, 2. శ్రీ జి.వి.వి.రామేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ, 3. శ్రీమతి జి.హైమావతి, ఎగ్జిక్యూటివ్ మెంబరు, 4. శ్రీమతి జి.శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబరు, 5. శ్రీ జి.రాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబరు, 6. శ్రీ ఈ.యు.ఆర్.భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబరు మరియు 7. శ్రీమతి జి.సీతారామమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కలిసి మెజార్టీ సభ్యులుగా చేసిన తీర్మానం ప్రకారము 1. శ్రీ సిరట్ల సత్యనారాయణ, 2. శ్రీ పి.టి.డి. ప్రసాద్‌మూర్తి 3. శ్రీ పి.హెచ్.జి.కృష్ణ, 4. శ్రీమతి జి.సత్య భారతి మరియు 5. శ్రీ పి.వి.వి. సుబ్రహ్మణ్యములను సొసైటీ బైలాలను అనుసరించి, సొసైటీ యొక్క బోర్డ్ మెంబర్ల స్థానము నుండి తొలగించడమైనది. ఈ ఐదుగురు కళాశాల నిర్వహణను ఆపి మరియు కళాశాలను మూసివేయాలని జేఎన్టీయూ, కాకినాడ వారి వద్ద ఇదివరలోనే పిటీషన్ దాఖలు పరచి సొసైటీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడియున్నారు. అంతియేగాక ప్రొఫెసర్లను, విద్యార్థులను కళాశాల మూసివేయుచున్నామని, వెంటనే కళాశాలకు తాళాలు వేయబోతున్నామని మరియు వెనువెంటనే కళాశాల ప్రాంగణమును వదిలి వెళ్ళవలసియున్నదని బెదిరించి, అందర్నీ భయభ్రాంతులకు గురిచేసియున్నారు.

ఇంతకు పూర్వమే అనగా 2009 నుండి 2020 వరకు వారు కళాశాల యొక్క వ్యవహారములను నిర్వహించిన సమయమునకు చెందిన ఆర్థిక లావాదేవీల వివరములను మరియు అప్పటి అకౌంట్లను ప్రస్తుత సొసైటీ యాజమాన్యమునకు ఇవ్వమని కోరినందున మరియు సదరు సొసైటీకి చెందిన డబ్బును దుర్వినియోగపరిచారని సొసైటీకి రూఢీగా తెలిసి వచ్చిన పిమ్మట వారిని ప్రశ్నించినందుకు గానూ పైన తెలిపిన అసామీలు చేసిన అక్రమాలు బయటపడతాయనే ఉద్దేశముతో, వారు సొసైటీకు నష్టము చేయు ఉద్దేశముతో, సొసైటీకు చెందిన నిత్య కార్యకలాపాలకు విఘాతము కలిగించుచూ, సొసైటీ ప్రస్తుత యాజమాన్యం ఐన మాపై అకారణమైన కక్షను పెంచుకొని, పైన తెలిపిన బహిరంగ ప్రకటన రూపేణా తప్పుడు ప్రచారం చేయుచున్నారు. అంతియేగాక, సదరు డబ్బు దుర్వినియోగం పైన మరియు వారు పాల్పడిన ఇతర అసాంఘిక కార్యకలపాల పైన మా క్లయింటు తీసుకోబోవు చట్టపరమైన చర్యలను ఎదుర్కొనలేక, మా క్లయింటు మరియు వారికి చెందిన అసామీలపైన సబ్బవరం పోలీసు వారి వద్ద తప్పుడు ఫిర్యాదుచేసి, కేసును కూడా రిజిష్టర్ చేసి యున్నారు. అంతియేగాక సదరు పైన తెలిపిన బహిరంగ ప్రకటన మూలకముగా తెలియపరిచిన అసాములు ఐన 1. శ్రీ సిరట్ల సత్యనారాయణ, 2. శ్రీ పి.టి.డి. ప్రసాద్‌మూర్తి 3. శ్రీ పి.హెచ్.జి.కృష్ణ, 4. శ్రీమతి జి.సత్యభారతి మరియు 5. శ్రీ పి.వి.వి.సుబ్రహ్మణ్యము గార్లకు సదరు సొసైటీకు ఎట్టి సంబంధం లేదని, చట్టపరమైన విధానములోని వారిని సొసైటీ నుండి తొలగించియుండటం చేత, వారు సొసైటీ పేరు పైన అక్రమముగా చేయబోవు ఎట్టి లావాదేవీలకు, వారు చేయగోరు ఎట్టి నియమకాలకు సదరు సొసైటీకు ఎట్టి సంబంధము లేదనియూ, అంతియేగాక వారు సొసైటీపై చేసిన అన్ని తప్పుడు అభియోగాలకై, వారిపైన సొసైటీ తీసుకోబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురు అని వారిని హెచ్చరిస్తూ తెలియచేయడమైనది.

శ్రీ కేసాప్రగడ వెంకట రామమూర్తి, శ్రీ కేసా ప్రగడ నరసింహామూర్తి,
న్యాయవాదులు, సద్గమయ, డోర్ నెం. 48-8-9, ద్వారకానగర్,
విశాఖపట్నం-530052. సెల్ : 9848625155